క్లుప్తంగా

దుగ్గిరాలలో పిల్లలకు వైద్యశిబిరం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల రథం సెంటర్‌లో తెనాలి న్యూలైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం పిల్లల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచి బానావత్ ఖుషీబాయ్, వెంకటేశ్వరరావు విచ్చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కుప్పా రాజశేఖర్ మాట్లాడుతూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ వైద్యశిబిరానికి అనేక మంది తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకువచ్చి పరీక్షలు చేయించుకున్నారని, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. శిబిరంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు కుప్పా రాధిక రాజశేఖర్, డాక్టర్ కె.టి.ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ గారపాటి అఖిల్ సేవలను అందించారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బెంచీలు ఏర్పాటు



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పలు ప్రాంతాల్లో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ తాడేపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, మాజీ కౌన్సిలర్ ఎండీ గోరేబాబు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలోని ముఖ్య కూడళ్లలో వైఎస్సార్ సీపీ సహకారంతో పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి పలు చోట్ల బెంచీలను ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో సింహాద్రి గోపి, బోయినపల్లి రాజు, బూదాల రవి, అష్రఫ్ ఆలీ, బాలాజీ, కటికల యోహాన్, ఆర్లగడ్డ దాసు, గోషి, పాతుల యేసేబు, సుధీర్, కొండయ్య పాల్గొన్నారు.

పేదలకు బియ్యం, పింఛన్ల పంపిణీ



గుంటూరు మెడికల్: వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్, వాసవీ యువ క్లబ్ గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్. అగ్రహారం గీతా మందిరంలో 102 మంది పేదలకు బియ్యం, పింఛన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న క్లబ్ జోన్ చైర్మన్ మున్నలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ 23 సంవత్సరాల కిందట క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ బియ్యం, పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. అది నేటికీ యథావిధిగా కొనసాగడం అభినందనీయమని తెలిపారు. కొల్లిపర దుర్గా నాగమణి, దాతల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొంజేటి వెంకట నగేష్, సెక్రటరీ పి. ఆంజనేయులు, కోశాధికారి గ్రంధి శ్రీనివాస్‌గుప్తా, వెంకట అనురాధ, కొంజేటి సుదీప్, గుండా హరిప్రసాద్, అచ్యుత నిరంజన్, సునీల్, కొప్పురావూరి లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ పారాయణం



పాత గుంటూరు: సంపత్‌నగర్‌లోని శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానం 58వ వార్షికోత్సవాన్ని గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీ హరిప్రసాదరావు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం శృంగేరికి చెందిన పది మంది వేద పండితులు చండీ పారాయణం చేశారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించాలి



నెహ్రూనగర్: డ్వాక్రా మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ప్రోత్సహించి వారికి ఆర్థిక చేయూత అందించాలని రాష్ట్ర చేనేత ఉత్పత్తుల కమిటీ సభ్యురాలు, డ్వాక్రా బజార్ నిర్వాహకురాలు కోట దేవకీదేవి కోరారు. బృందావన్ గార్డెన్స్‌లోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌లో ఆదివారం ఆమె మాట్లాడారు. డ్వాక్రా బజారు మార్చి 21వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



1972-73 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

మంగళగిరి: కళ్లలో శుక్లపు పొరలు కంటి చూపునకు అడ్డుపడుతున్నా.. వారి కనుపాపల్లో ఆనందాల జ్యోతులు వెలిగాయి. ఆ నడకల్లో సత్తువ మందగించినా.. ఆ వేదిక తాకగానే వారి పాదాలు నాట్యమాడాయి. తాతా అని పిలుపునకు చేరువైనా.. ఆ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే ఆ హృదయాలు 60 ఏళ్ల వెనక్కి నెట్టాయి. అక్షరాలు దిద్దించిన గురువుల జ్ఞాపకాలు మదిలో మెదులుతుండగా.. బాల్యపు స్నేహ మాధుర్యాలు అక్షర కుసుమాలై పరిమళించాయి. తమ చదువుల గుడికి దాతృత్వపు హారం వేసిన అపూర్వ ఘట్టాలు పెదవడ్లపూడి గోలి నాగశయనరావు తోటలో ఆదివారం ఆవిష్కృతమయ్యాయి.

మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి పెదవడ్లపూడి గోలి నాగశయనరావు తోటలో ఆదివారం రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1972-73 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ద్వితీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.

అనంతరం సమ్మేళనం కన్వీనర్ అన్నే చంద్రశేఖర్ మాట్లాడుతూ పెళ్లిళ్లు, ఫంక్షన్ల కంటే చిన్ననాటి బాల్యమిత్రులను కలవడం కంటే మించిన ఆనందం మరొకటి లేదన్నారు. 51 సంవత్సరాల తరువాత చిన్ననాటి స్నేహితులను కలుసుకుని నాటి జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను తలుచుకుని అనుభూతులు పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుంటూరు రామారావు, కాల్వ శివలింగయ్య, ఆనంద్ ప్రసాద్‌రెడ్డి, ఇసాక్, కట్టా భాస్కర్, దేవదత్తు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో రక్త పరీక్షల శిబిరం



గ్రామస్తులకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్న కేఎల్‌యూ ఫార్మసీ కళాశాల విద్యార్థినులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థినులు వడ్డేశ్వరం ప్రజలకు రక్త పరీక్షల శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సుప్రియ మాట్లాడుతూ రక్తహీనత సమస్య వలన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని ప్రజలకు వివరించామని తెలిపారు. రక్తహీనత సమస్య వలన అలసటకు గురికావడం, చెమటలు పట్టడం, నీరసించి పోవడం, కళ్లు తిరగడం వంటి సమస్యలు తలెత్తుతాయని, నివారణ కోసం పండ్లు, కూరగాయలు తీసుకోవాలని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు హీమోగ్లోబిన్ మరియు బ్లడ్ గ్రూప్‌ల పరీక్షలు నిర్వహించామని, ప్రతి ఒక్కరు బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని వివరించామని తెలిపారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.జోనితిన్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎక్కించాల్సిన సమయంలో బ్లడ్ గ్రూప్ తెలిసి ఉండాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను, సమన్వయకర్తలు పి. సురేష్, జి.చంద్రశేఖర్‌లను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్‌చాన్సలర్స్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చక్రవర్తి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి డాక్టర్ గంధర్వ స్పైస్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సుమన్ అభినందించారు.

ఖురాన్ కంఠస్థ పోటీలకు స్పందన



పోటీల్లో పాల్గొన్న ముస్లిం చిన్నారులు

తెనాలిఅర్బన్: నాజర్‌పేటలోని ఎన్‌వీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో ఒకటి నుంచి ఆరో తరగతి చదువుతున్న ముస్లిం విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారులు ఖురాన్‌లోని సూరాలను చూడకుండా అనర్గళంగా పఠించడం అందరినీ అబ్బుర పరిచింది. గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చారు. అలాగే పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో ముఫ్తీ అల్లావుద్దీన్, ఖారీ ఖ్రముజ్ జామా, హఫీజ్ జుబేర్ సాహెబ్, ముఫ్తీ హైదర్ ఆలీ సాహెబ్, హఫీజ్ ఇమ్రాన్ బేగ్, ఎస్.ఎస్ సుభానీ, హఫీజ్ అబ్దుల్ ఖరీం, ఖజూర్ సుభానీ, షేక్ నాసర్ అహ్మద్, షేక్ మొహిద్దీన్, డాక్టర్ కమ్మెల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి రామసాయి మందిర వార్షికోత్సవాలు



కొలకలూరులోని షిరిడి సాయి మందిరం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని శ్రీ రామసాయి జ్ఞాన మందిరంలో వార్షిక మహోత్సవ వేడుకలు ఈ నెల 27 నుంచి మార్చి 2 వరకు జరగనున్నాయి. మందిరంలోని వేంచేసి యున్న శ్రీ గణపతి, దత్తాత్రేయ, రామదాసు సమేత శ్రీ సద్గురు సాయిబాబా దివ్య మంగళరూప విగ్రహ ప్రతిష్టా మహోత్సవం జరిగి 16 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. 22న ఉదయం వార్షికోత్సవ అంకురార్పణలో భాగంగా శ్రీ బాబావారి పల్లకి గ్రామోత్సవం జరుగుతుంది. అనంతరం ఉదయం గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, కలశ స్థాపన, పుణ్యాహవచనం, అఖండ జ్యోతి దీపారాధన నిర్వహించబడుతుంది. అనంతరం గ్రామంలో భిక్షాటన కార్యక్రమం జరుగుతుంది. రాత్రి ఏడు గంటలకు బాబావారి సన్నిధిలో భారత నాట్య ప్రదర్శన జరుగుతుంది. 28న ఉదయం బాబావారి 108 కలశములతో కలశాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం అగస్త్యేశ్వర భజన సమాజం, శ్రీ దత్తారామసాయి భజన సమాజం వారిచే లలితా, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తారు. రాత్రికి కోలాట ప్రదర్శన ఉంటుంది. 29న నుంచి మార్చి 1వ వరకు గ్రామంలో ఉన్న భజన సమాజం వారిచే సాయినామ సంకీర్తన ఏకాహం నిర్వహించబడుతుంది. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని రామసాయి ట్రస్ట్ చైర్మన్ సతీష్ కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ గణేషుని రాజేష్

గుంటూరు మెడికల్: సుదర్శిని ఐ అండ్ విజన్ అసోసియేషన్, సుదర్శిని కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో యాదవ హైస్కూల్ పూర్వ అధ్యాపకుల అసోసియేషన్ సహకారంతో ఆదివారం స్థానిక పాత గుంటూరు యాదవ హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుదర్శిని కంటి హాస్పిటల్ అధినేత డాక్టర్ గణేషుని రాజేష్ వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. సుమారు 30 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. అత్యాధునిక కంటి వైద్య పరికరాలు ఉన్న 'విజన్ ఆన్ వీల్స్' సంచార కంటి ఆసుపత్రిని వైద్య శిబిరానికి తీసుకొచ్చి పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పేదలకు కంటి సమస్యల గురించి అవగాహన కల్పించి ఖరీదైన వైద్యాన్ని సైతం ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. శిబిరంలో డాక్టర్ అదితి, మేనేజర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత



జోసఫ్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: 25వ డివిజన్ పరిధిలోని జోసఫ్‌నగర్, కృష్ణబాబుకాలనీ ప్రాంతాల్లో ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం –2 ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సేవా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.ధాత్రికుమారి ఆధ్వర్యంలో విద్యార్థినులు నీటి సంరక్షణ, శుద్ధ జలంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. నీటి ద్వారా సంక్రమించే అతిసార వ్యాధి వంటి జబ్బులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. వర్షపు నీటిని ఇంకుడు గుంతలద్వారా నిల్వ చేసే పద్ధతుల గురించి ధాత్రికుమారి వివరించారు. భూగర్భ నీటి వనరుల మట్టాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో విద్యార్థినులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కామర్స్ అధ్యాపకురాలు శ్రీలత పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యం

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీరని ద్రోహం చేశారని టీడీపీ నాయకులు ఆరోపించడం హాస్యాస్పదమని అన్నారు.

కరెంట్ పోల్స్ ఏర్పాటు

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం గ్రామంలోని రాధా రంగానగర్‌లో విద్యుత్ పోల్స్ ఆదివారం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) గ్రామంలో పర్యటించిన సందర్భంగా స్థానికులు రాధా రంగానగర్ 1వ లైన్‌లో కొంతప్రాంతం సింగిల్ ఫేస్ కరెంటు లైన్, కరెంట్ పోల్స్ సరిగ్గా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్న విషయాన్ని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సుమారు 200మీటర్ల పొడవున కరెంటు స్తంభాలు, 3ఫేస్ కరెంటు లైన్లను 24గంటల్లో ఆదివారం విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. తమ సమస్యను తెలిపిన వెంటనే స్పందించి, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినందుకు రాధారంగా నగర్ వాసులు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు.

ఆంజనేయుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లో వేంచేసి యున్న శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీ చక్రస్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు ఎంజీఎల్ రఘురామ్, వేదాంతం నాగమూర్తి, ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైదిక క్రతువును నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీలక్ష్మి కూచిపూడి నృత్య కళాఖండం ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి శిష్య బృందం చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలువురు దంపతులు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవా సమితి అధ్యక్షులు ఆర్‌వి.కిరణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పేరంటాళ్ల తిరునాళ్ల

పెదకాకాని: పెదకాకాని ప్రధాన సెంటర్‌లోని శ్రీ ఉయ్యూరు వీరమ్మ పేరంటాళ్ల తిరునాళ్లను పురస్కరించుకుని ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. ఐదు రోజులుగా తిరునాళ్లలో భాగంగా ట్రాక్టర్‌పై అమ్మవారిని కొలువుదీర్చి కొమ్ముల వాయిద్యాలు, కనక తప్పెట్లు నడుమ తక్కెళ్ళపాడు, వెనిగండ్ల, పెదకాకాని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. బహుళ పాడ్యమి ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ పాతూరు ఏరియాలో గ్రామోత్సవం జరిగింది. రాత్రి 10 గంటల తరువాత ముదరపోలు పోయుట, గ్రామసిడి, సింకా వారి బోనం, భక్తుల సిడిమాను మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

మాంసం విక్రయదారులకు నోటీసులు



మాంస విక్రయదారుడికి నోటీసు అందిస్తున్న ఎంహెచ్‌ఓ మధుసూదన్

నెహ్రూనగర్: నగరంలో పరిశుభ్ర వాతావరణంలోనే మాంస విక్రయాలు చేపట్టాలని ఎంహెచ్‌ఓ మధుసూదన్ వ్యాపారులకు చెప్పారు. ఈ మేరకు వ్యాపారులకు నోటీసులు జారీ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించిన నేపథ్యంలో ప్రజారోగ్య అధికారులను ఆదివారం నగరంలోని 256 స్టాల్స్‌కి అందజేశారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ మాట్లాడుతూ చికెన్, మటన్ తదితర మాంస విక్రయదారులు తప్పనిసరిగా స్టాల్స్, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. నిషేధిత క్యారీ బ్యాగ్‌లు వినియోగించవద్దని, వ్యర్థాల సేకరణ చేసే ఏజెన్సీకి మాత్రమే వాటిని ఇవ్వాలని చెప్పారు. మాంస వ్యర్థాల్ని కాల్వలు, రోడ్ల మీద వేస్తే వెంటనే ట్రేడ్ లైసెన్స్ రద్దుతో పాటు భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు. మాంస వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. స్టాల్స్ శుభ్రంగా లేకపోతే ప్రజలు కూడా మాంసాన్ని కొనుగోలు చేయవద్దని, లేనిపక్షంలో ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని సూచించారు.

అలరించిన సంగీత విభావరి



పాటలను ఆలపిస్తున్న గాయకులు

పాత గుంటూరు: అమరావతి రోడ్డు అన్నదాన సమాజం ఆడిటోరియంలో నవకళోదయ ఆర్ట్స్ ఆర్గనైజర్ పి.ఎల్.ఎస్.మూర్తి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఘంటసాల సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. సెయింట్ లారెల్స్ స్కూల్ డైరెక్టర్ మేకల రవీంద్రబాబు, బిల్లా అశోక్, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఘంటసాల ఆలపించిన పలు పాత సినిమా పాటలను గాయకులు టి. సుధీర్, స్టాలిన్ బాబు, నారాయణ, మోహన్, గాయత్రి, విజయలక్ష్మి శ్రావ్యంగా పాడి శ్రోతల్ని మైమరపింపచేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, దయాసాగర్ దంపతులు
- నిడుముక్కలలో కాంస్య విగ్రహ ఆవిష్కరణ

నిడుముక్కల(తాడికొండ): భారతదేశంలో రూపొందించిన ప్రతి చట్టంలోనూ అంబేడ్కర్ ఆలోచనా విధానం, దార్శనికత నిండిన ప్రతిరూపమే ఉంటుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత, మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ దయాసాగర్ పేర్కొన్నారు. తాడికొండ మండలం నిడుముక్కలలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. తాడికొండ అడ్డరోడ్డు కూడలి నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రపంచ మేధావులలో ఒకరిగా పేర్కొన్నారు. విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక ఎదుగుదల సాధ్యమని నేడు తాము కూడా రాజకీయ వేదికగా, ఉద్యోగ రంగాల్లో ఉన్నతంగా ఎదిగామంటే అది అంబేడ్కర్ పుణ్యమే అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా అడుగులు వేయాలని కోరారు. నిడుముక్కలలో నిర్మించిన పార్లమెంటు నమూనా భవనంలో రూ.లక్ష విలువ చేసే అంబేడ్కర్, కాంపిటీటివ్ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను బహుమతిగా అందించనున్నట్లు ప్రకటించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి కట్టించేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. గతంలో ఇంగ్లిష్ మీడియం విద్య చదవాలంటే పేద, ధనిక తారతమ్యం నడుమ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ నేడు పేదలకు నాణ్యమైన విద్యనందించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశ పెట్టడం పేదలకు వరమన్నారు. గతంలో కులాల వారీగా ఇళ్ల స్థలాలు కేటాయించే ప్రభుత్వాలను చూశామని, కానీ సీఎం వైఎస్ జగన్ కేబినెట్ చర్చలో ఇది ప్రస్తావనకు రాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించిన సమసమాజ స్థాపన ఇక్కడ నుంచే ప్రారంభం కావాలని లాటరీ విధానం ద్వారా అన్ని వర్గాలకు ఒకే చోట ఊళ్లను నిర్మించి ఇచ్చాడని కొనియాడారు. అనంతరం అతిథులను విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి మాదాసు రత్నకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, ఎంపీటీసీ బోడపాటి సుశీల, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, సీనియర్ నాయకులు బోయపాటి సాంబశివరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి ధర్మరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి బాకి వెంకటస్వామి, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, బెజ్జం సాయి ప్రసాద్, అంబేడ్కర్ యూత్ సభ్యులు వేల్పూరి కరుణబాబు, నీలాంబరం, బోడపాటి నాగరాజు, గుంటి రఘువరన్, మాదాసు ఏసురత్నం, జాలాది ఏసుపాదం, దేవరపల్లి చినపాములు, తమ్మనంపల్లి రాజు పాల్గొన్నారు.



నిడుముక్కలలో బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, దయాసాగర్ దంపతులు

సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగన్

- నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి
- పట్టణంలో 'గుడ్ మార్నింగ్ మంగళగిరి'



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరి: సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి కొనియాడారు. 17వ వార్డులో గుడ్ మార్నింగ్ మంగళగిరి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంజి చిరంజీవి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నామని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు, పెన్షన్లు అందజేసిన ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, నాయకులు మొహమ్మద్ ఫిరోజ్, మల్లవరపు సుధారాణి, పెద్దబ్బాయి, మునగాల చంద్రశేఖర్, బేతపూడి నర్సయ్య పాల్గొన్నారు.

వీనుల విందుగా హరికథా గానం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 159వ జయంతి, 79వ వర్ధంతి పురస్కరించుకొని నారాయణదాసు కథాగాన కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణం హరికథా గానం వీనులవిందుగా సాగింది. ఆలయ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ హరికథా భాగవతారిణి జయంతి సావిత్రి శ్రీ సీతారాముల కల్యాణ విశేషాలను చక్కగా గానం చేశారు. వయోలిన్‌పై రవిబాబు, మృదంగంపై ఎం.నగధరరావు వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని ఉపాధ్యాయుల రాజరాజేశ్వరి పర్యవేక్షించారు.